# మానవుడూ-గీతా

కోటి నక్షత్రాల ఈ ఆకాశంకింద కూర్చుంటే వెయ్యి ఆలోచనలు...కొన్ని గతాన్ని గురించీ...కొన్ని భావిని గురించీ. గతంలో, ఒకరోజుని గురించి, మరీ మరీ...

ఆరోజు రంగనాథం ఆరు లోపునే వస్తానని వాగ్దానం చేసేడు. పదినిమిషాలు దాటినా అతను వచ్చే జాడ కనిపించ లేదు. ముందర నిజంగానే నాకు కోపం వచ్చింది అతనిమీద. ఈవేళ క్లబ్‌లో బ్రిడ్జి ఆడుకుందామని ప్లానువేశాం. వచ్చేవారం టోర్నమెంట్; షీల్డు గెలుచుకోవాలని చాలా కారణాలవల్ల నా ఆత్రత. అదీకాక ఈమధ్య అతనూ, నేనూ కలుసుకోవడం తక్కువై పోయింది. కాలేజీలో, యూనివర్సిటీలో మే మిద్దరం సహాధ్యాయులుగా, స్నేహితులుగా ఎంతో దగ్గిరగా ఉండ డాన్ని ఈ విషయం బాధ కలగజేసింది. కంపెనీ పనిమీద నేనూ, ప్రభుత్వపు పనిమీద అతనూ టూర్లు వెళ్లడాన్ని ఈ మధ్య మరీ తక్కువై పోయింది కలయిక.

ఆరున్నర అయేసరికి కోపం తగ్గిపోయి ఆత్రత ఎక్కు వయింది. రంగనాథంలో నాకు నచ్చని విషయాలు చాలా ఉన్నాయి. అతను బ్రహ్మచర్యం వదిలి పెళ్లిచేసుకోడానికి నిశ్చయించినప్పుడు ఒక రాత్రి అంతా దెబ్బలాడేను,

"ఆ అమ్మాయి నామీద తన జీవితం అంతా ఆధారం చేసుకుంది" అన్నాడు రంగనాథం.

"నీ కెలాగ తెలుసును?" అన్నాను.

"ఆమె చెప్పింది."

నవ్వి, "బ్రదర్! ఆ మాట నువ్వెలాగ నమ్మేవు? చరిత్ర చూడు, ప్రపంచం చూడు. ఈ తియ్యటి మాటలూ, వెచ్చటి నిట్టూర్పులూ నమ్మి ఎవరైనా బాగుపడ్డారా?" అని మందలించేను.

"నీకు బోధపడదు, రావ్!...రాధ అందరిలాగా కాదు. ఆమె కళ్లల్లో ఆమె హృదయం అంతా నిండి ఉంటుంది. అమాయికత్వం వాటిలో తొణికిసలాడుతూ ఉంటుంది. అసత్యం చెప్పే మనిషి కాదు రాధ. నా అంతరంగంలోనించి ఆ మాట నాకూ తెలుసు" అన్నాడు వెర్రిగా చూస్తూ రంగనాథం.

"ఆ కళ్లల్లోని అమాయికత్వం నీ కళ్లల్లోని మూర్ఖత్వం, బ్రదర్! నా మాట విను. నీలాటి వాణ్ణి ఇంత త్వరగా, కరిగించిన అమ్మాయి అమాయికురాలు కాదు. ఆలస్యం కాకుండానే మేలుకో!" అని బ్రతిమాలేను.

"హృదయం లేని మనిషివి నువ్వు. రాధకి కావాలంటే నాకన్న గొప్పవాళ్లు నలభైమంది దొరుకుతారు."

"అయితే, నాకు నలుగురి పేర్లు చెప్పు."

"సిల్లీగా మాట్లాడకు."

"మూర్ఖులకి నిజం సిల్లీగానే కనిపిస్తుంది, రంగనాథం! కొంచెం ఆలోచించు" అన్నాను.

"చాలా ఆలోచించేను, రావ్! రాధ నన్ను అంగీకరించడం నా అదృష్టం. నిష్కారణంగా ఆమెని అంటున్నావు.

దయచేసి ఆమె విషయం ఎత్తకు" అన్నాడు రంగనాథం, చివరికి కొంచెం కోపంగానే.

నాకూ కోపం వచ్చింది. "సరే, నీ మంచికోసం చెప్పేను. ఆర్నెల్లుకానీ, నువ్వే అంగీకరిస్తావు" అని అతని ఇల్లు వదిలి వచ్చేసేను. ఆ తరవాత వారం రోజులు అతనితో మాట్లాడలేదుకూడా తరవాత పూర్వపు సాన్నిహిత్యం మాలో రాలేక పోయింది.

రాధ అంటే నాకు ప్రత్యేకమైన కోపం ఏమీలేదు, ఆమె రంగనాథాన్ని ముక్కు పట్టుకుని నడిపిస్తుందని తప్ప. అతని మీద నా అభిమానం ఆ పరిస్థితిని సహించలేనిదిగా చేసింది మటుకు నిజం.

పెళ్లి అయి వాళ్లు రాగానే స్టేషన్లో ఆమెనీ నన్నూ పరిచయంచేస్తూ, "ఇతను నా ప్రాణమిత్రుడు చివరికి నిన్ను కూడా నమ్మనంత అభిమానం. రావ్! రాధని చూశాక నీ భయాలన్నీ తప్పు అని ఒప్పుకుంటావా?" అని రంగనాథం అనడం రాధకి నా మీద అభిమానం కలిగించలేదు, కనీసం అతను ఆ మాటలనకుండా ఉంటే బాగుండును. కాని, పెళ్లి అనగానే అందరు దంపతులూ ముందర వాగ్దానాల్లో "మన మధ్య రహస్యాలు ఉండకూడదు" అనేది చేసుకుంటారు. భర్తలు దాన్ని

ఆచరిస్తారు. భార్యలకి లోకజ్ఞానం ఎక్కువ కనక ఆ వాగ్దానాల్ని నీటిమీద గీతలుగా రాస్తారు.

నేనంటే ఎక్కువ ఆదరాభిమానాలు లేనందుకు రాధని నేను నిందించను. కాని ఆమెని మార్చే ప్రయత్నం ఏమీ నేను చెయ్యలేను. అప్పుడప్పుడూ ఆమే, నేనూ తటస్థపడినప్పుడు చిన్న చిన్న వాదోపవాదాలు జరిగేవి. కాని, ఎవరి హద్దుల్లో వాళ్లు ఉండి, ఎదటివాళ్లని గాయపరచకుండానే అవి జరిగేవి.

అందుచేతనే రంగనాథం ఇంటికి అత్యవసరమైతే తప్ప వెళ్లే అలవాటు లేదు నాకు. ఆ విషయం అతనికి చాలా అసంతృప్తి కలిగించింది. దశాబ్దంపైగా కలసిమెలసిన మా మధ్యకి రాధ వచ్చిన నిజాన్ని బయటికి రాకుండా ఇద్దరమూ చిత్రమైన తెరల వెనక దాచామనుకుంటాను.

కనీసం నాతో మాట తప్పని మనిషి రంగనాథం. అతను రాకపోవడం ఆత్రత కలిగించింది.

అయిష్టంగానే కారుతీసుకుని రంగనాథం ఇంటికి వెళ్లేను. వెళ్లేసరికి గార్డెన్‌లో ఆడుకుంటూన్న కుక్క నా రాకని గొంతుక శక్తికొద్దీ ప్రకటించింది.

కారు దిగి డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లి నిలబడ్డాను ఇంట్లో ఎవ్వరూ లేనట్టు మరీ నిశ్శబ్దంగా ఉంది. కనీసం రేడియో కూడా వినబడ్డంలేదు రాధకి నిశ్శబ్దం అంటే అసలే పనికి రాదు రంగనాథం చాలా సార్లు ఆ విషయం బాధగా చెప్పేవాడు.

"రాధతో చెప్పు" అన్నాడు ఒకసారి.

"నొచ్చుకుంటుంది" అన్నాడు రంగనాథం.

"అయితే బాధపడు" అని నిర్ణయించేను.

కొన్ని నిమిషాలు ఏంచెయ్యాలో తెలియక అలాగే నిలబడ్డాను. పూర్వపు రోజుల్లాగ తిన్నగా బెడ్ రూమ్‌లోకి వెళ్లి నిద్రపోతున్న మనిషిని లేవదీసే పరిస్థితి కాదు!

ఇంతలో రాధ వచ్చి, తెల్లబోయి, "హల్లో!" అంది నిలబడి.

ఆమె ఆకారం చూసి చాలా ఆశ్చర్యపడ్డాను. ఇప్పుడే నిద్రనించి లేచినట్టు ఉంది. కాని చాలా నీరసంగా, దీనంగా కనిపించింది. సామాన్యంగా రాధ చాలా ఉత్సాహంగా ఉండే మనిషి.

"రంగనాథం లేడా?" అన్నాను.

లేదని తల ఊపి, "కూర్చో" అంది రాధ.

"థాంక్స్. కాని. నేను వెళ్లాలి. అత నెక్కడికి వెళ్లాడో తెలుసునా?" అన్నాను.

"తెలీదు...టీ తాగి వెళ్లు" అంది రాధ.

"వద్దు."

"ఏం? తొందరగా వెళ్లాలా?"

"అవును."

"ఎవ రా అదృష్టవంతురాలు?"

నవ్వి, "నాకూ, అమ్మాయిలకీ పడదని నీకు తెలుసును" అన్నాను.

"అవును, ఆజన్మాంత బ్రహ్మచారివి!...కాని, పదినిమిషాలు కూర్చో. నీతో మాట్లాడాలి" అంది రాధ.

ఆమె గొంతుకలో స్పష్టంగా విషాదచిహ్నాలు కనిపించి, కొంచెం ఆశ్చర్యం కలిగించేయి...ఏదో జరిగిందన్న అనుమానం బలపడింది. అదేదో తెలుసుకోవాలన్న ఆత్రతని ఆమెకీ, రంగనాథానికీ మధ్యకి వెళ్ళకూడదనే నిర్ణయం జయించింది.

కాని, ఆ నిమిషంలో రాధని తృణీకరించి వెళ్లి పోవడం సమజసంగా కనిపించలేదు. ఇరుకునపడి కూర్చున్నాను. రాధ లోపలికి వెళ్లి రెండు గ్లాసుల్లో లెమన్ జ్యూస్ తెచ్చి నాకిచ్చి, తను తీసుకుని ఎదురుగా కూర్చుంది.

"నీ కెలాగ చెప్పాలో తెలీదు" అంది ఒక నిమిషం నిశ్శబ్దం తరవాత.

"చెప్పకూడనిదైతే చెప్పకు"

"నువు హృదయం లేని మనిషివి" అంది రాధ. విచారంగా.

ప్రయత్నించినా చిరునవ్వు ఆగలేదని నాకు. "ఈవేళ ఆ మాట రెండోసారి వినడం" అన్నాను.

"నిజంకనక అందరూ అంటారు" అంది రాధ అప్పటిదాకా ఉన్న ధైర్యాన్నించి కోలుకుంటూ.

"అది మరొక అబద్ధం. గీతకే అలవాటు, అబద్ధా లాడ్డం"

"నిజంగానే నీకు హృదయం లేదు. గీతకూడా అదే మాట అందా? ఎందుకని?" అంది రాధ.

"అఁ...డార్జిలింగ్‌తో ఉన్నంతకాలం ఏమీ సుఖపడ లేదుట. నేను రావడంలేదన్న మాట తెలియగానే వెంటనే వెనక్కి వచ్చేసునుట...మదర్ మాట కాదనలేక గాని!"

"నువ్వేమన్నావు?"

"నవ్వి, ప్లాట్ బలంగా లేదన్నాను, నిజానికి నాకు ఉత్తరం రాసేందుకుకూడా ఆ అమ్మాయికి తీరుబాటు లేదు. ఇక్కడికి వచ్చిన రెండు రోజులదాకా గీతకి టెలిఫోన్ చేసే తీరిక లేదు. అంచేత అబద్ధాలు ఆడేవాళ్లు దొరికిపోయేలాగ ఆడకూడ దన్నాను.

వింతగా చూసింది రాధ. "ఈ చిన్న చిన్న అబద్ధాల్లో ఎంత నిజం ఉందో నీకు తెలియదులే!" అంది నిట్టూరుస్తూ.

సంభాషణ పెడదారి పట్టిన సంగతి గుర్తించుకుని, "నాకు అలాటిదేమీ తెలీదు' ఏమిటి చెబుతానన్నావు? రంగ నాథం ఎక్కడికి వెళ్లేడు?" అన్నాను.

లెమన్ జ్యూస్ కొంచెం చప్పరించి, "అదే నాకూ తెలీదు, రావ్! సాయంత్రం చెడ్డ సంఘటన ఒకటి జరిగింది. ఆ తరవాత ఎక్కడికి వెళ్లేరో తెలీదు. భయంగా ఉంది" అంది రాధ.

"ఏం జరిగింది?"

"నా దురదృష్టం. వెంకటేశన్ తెలుసునా? అతని సిస్టర్ ఆయన ఆఫీసులోనే స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తూంది."

"తెలుసును."

"అతను వచ్చేడు. ఇక్కడికి తరుచు వస్తూఉండే వాడులే. ఈవేళ వస్తూనే కవిత్వం మొదలు పెట్టేడు."

"అంటే?"

"అంటే-నా కళ్లెలాగ ఉన్నాయో, నా ఆకారం అతనిలో ఎలాటి భావనలని కలిగిస్తూందో, నే నెంత చక్కగా మాట్లాడతానో, నా సాన్నిహిత్యం అతని మనస్సుని ఎన్ని విధాలుగా ఎంతగా పులకరింప జేస్తూందో..."

"గుడ్!"

"ఆఁ-కొంచెంసేపట్లో వెరీగుడ్ దాకా వెళ్లింది. మీద నించి చేతులు తీసేలోపున ఆ క్షణంలోనే ఆయన వచ్చారు."

"ఎక్సలెంట్!" అందామనుకున్నాను కాని, మరీ క్రూరంగా ఉంటుందని నిశ్శబ్దంగానే ఉండిపోయేను. ఆమె బాధపడుతూంది. వెంకటేశన్‌తో ఆమె తరచు రేసెస్ చూడ్డానికీ, సినీమాలకీ వెడుతూఉండేదని తెలుసును. బహుశా, ఆమె ఈవేళ గ్రహించి ఉంటుంది. తల వంచుకుని గ్లాసులోకి చూస్తూ కూర్చున్న రాధని ఎత్తిపొడిచే మాటలన్నీ దాచిపెట్టి, "తరవాత ఏం జరిగింది?" అన్నాను.

"ఆయన మీదికివెళ్లి స్నానంచేసి వెళ్లిపోయారు స్కూటర్ తీసుకుని...ఆయన రాగానే పలాయనం చిత్తగించాడు వెంకటేశన్."

"రంగనాథం—ఏమీ అనలేదా?"

"ఒక్క మాటాడలేదు...ఏమనాలో నాకూ తెలియలేదు..."

కొంచెంసేపు అలాగే కూర్చున్నాము ఇద్దరం, ఏం చేయాలో నాకూ తెలీలేదు...ఆమె జరిగినదంతా నాకు చెప్పి కొంత తేలిక పడినట్లు ఉంది. కాని, నా బరువు ఎక్కువగా ఉంది. రాధకోసం అనికాదు రంగనాథం మనఃప్రవృత్తిని ఎరిగిన వాణ్ణి కాబట్టి ఈ సంఘటన అతన్నెంత ఎక్కువగా బాధ పెట్టి ఉంటుందో ఆలోచించుకుని. రాధ అంటే అతనికి కొంచెం భయం ఉన్నా, విపరీతమైన మమత. కనక.

"ఏదిచెయ్యమంటావు నన్ను?" అన్నాను.

"దయచేసి చూడు ఆయనకోసం...నిజం నీకు చెప్పేను. తగినట్టు చెప్పు...పొరపాటు నాదేనని నాకు తెలుసును. ఆయనకి చెప్పు... ప్లీజ్!"

సగం తాగిన లెమన్ జ్యూస్ వదిలేసి నెమ్మదిగా లేచాను. కన్నీళ్లు దాచుకున్నా, ఆమె నాతో ఇంత దీనంగా మాట్లాడేందుకు ఎంత చెడ్డస్థితిలో ఉందో తెలుసును

పోర్టికోదాకా ఆమె నా వెనకాలనే వచ్చింది. ఆమె ముఖంలోకి చూడకుండానే తిన్నగా క్లబ్ కి వెళ్లాను రంగనాథం అక్కడికి రాలేదని తెలిసింది మిత్రులనించి,

ఏంచెయ్యాలో తెలీక గార్డెన్‌లో కూర్చున్నాను. రంగ నాథం ఎక్కడికి వెళ్లి ఉంటాడు? అతనికి సినీ మాలంటే పడదు. ఈ మానసికాఘాతంనించి కోలుకోడానికి అతను కొంతసేపు ఒంటరిగా కోరు కోవడం సహజం. ఈ ఊళ్లో చక్కటి ప్రదేశాలు చాలా ఉన్నాయి. అతను తాజ్‌కి వెళ్లి ఉండవచ్చు — కాని ఈ సమయంలో అక్కడ వందలకొద్దీ వచ్చి లాన్స్‌లో కూర్చుంటారు. షాజహాన్ గార్డెన్స్‌లోకి వెళ్ల వచ్చు. యమున ఒడ్డుకి వెళ్లి ఉండవవచ్చు. సికంద్రా వెళ్లి ఉండవచ్చు.

అక్కడ చాలా ప్రశాంతంగా ఉంది. అంతపోయిగా అక్కడ కూర్చోవడం నేరం అనిపించింది. లేచి కారు కోసం వెడుతూంటే గీత కనిపించింది — చేతిలో బేట్ ఉంది. ఒకటో గేమ్స్ ఆడడం అలవాటు ఆమెకి.

నన్నుచూసి తెల్లబోయి, "హల్లో!" అంది.

"హల్లో!...నీకోసంచూసి ఇప్పుడే వెడుతున్నాను." అన్నాను అప్రయత్నంగా. ఆ మరుక్షణంలోనే అంత అబద్ధం ఆడినందుకు నాకే ఆశ్చర్యం వేసింది. కాని ఎంతో అందంగా, తియ్యగా చిరునవ్వు నవ్వుతూన్న గీత ఆ ఆశ్చర్యాన్ని సంతృప్తిగా మార్చేసింది.

"ఎక్కడికి వెడుతున్నారు? మీరు ఉంటారని అనుకునే వచ్చాను" అంది గీత.

ఒక్క అబద్ధం ఎన్ని అవస్థలకి దారితీస్తుందో ఈ సంభా షణ ఋజువుచేసింది. ఆమె అపార్థం చేసుకునే పరిస్థితి రాకుండా

"చేతిలో రేకెట్ ఉంచుకుని ఎందుకని అబద్ధం ఆడతావు?" అన్నాను.

నవ్వి, "మీరు ఉంటారనీ, బ్రిడ్జినించి ఇవతలకి రాగలుగు తారనీ కలగనలేదు...ఎక్కడికి వెడుతున్నారు?" అంది.

"తాజ్ వైపు తిరిగి వద్దామని" అన్నాను.

"గుడ్! పదండి."

పైకి కనపడని అయిష్టంతో ఆమెని కార్లో కూర్చోబెట్టి నెమ్మదిగా దారితీశాను. సంవత్సరంనించి మా మధ్య ఉంచు కున్న దూరం ఈరోజు మరీ దగ్గిరయిపోయింది. అమ్మ మాట పదిసార్లు కాదనలేక గీతని కలుసుకోడానికి వెళ్లేను. ఆ రోజు బాగా జ్ఞాపకం. "కనీసం నా మాటకోసం ఐనా వెళ్లి ఆ అమ్మాయిని చూడు! నువ్వువస్తావని చెప్పాను వాళ్లకి. ఆపైన నీ ఇష్టం" అని రాసింది అమ్మ. లాంఛనంగా వెళ్లి, గీతని కలుసుకున్నాను. సహజంగా వివాహం, సంసారం, పిల్లలూ అంటే ఉన్న నా వైముఖ్యం. ఎంతో అందమైన అమ్మాయి: ఎమ్.ఎ., చదువుతూంది. శ్రీమంతుల పిల్ల...కాని, పెళ్లిమాట ఆలోచించదలచుకోలేదు నేను.

నా విముఖత గమనించి గీత నా స్నేహితురాలుగా దగ్గి రికి వచ్చింది...అంటే, కొంత దగ్గిరికి ప్రపంచం తెలిసిన అమ్మాయి కనక, నిట్టూర్పులతో, కన్నీళ్లతో, ఆమె నన్ను ఓడించే ప్రయత్నం చెయ్యలేదు. కాని, ఉండీ ఉండీ ఎదురు చూడని మాటలాడేది డార్జిలింగ్ విషయంలో లాగ. ఇవన్నీ

కాగితపు పువ్వుల్లాంటి అబద్ధాలని నాకు తెలియకపోలేదు. ఆ జ్ఞానమే నన్నా మెకి దూరంగా ఉంచింది, ఈ సాయంత్రందాకా!

సదర్ బజారులోనించి వెళ్లాను, క్లార్క్ హోటల్ పక్క నించి. గీత ఏమీ మాట్లాడలేదు. నేను రంగనాథం స్కూటర్ కోసం చూస్తున్నాను. తాజ్ ముందరా అతని స్కూటర్ లేదు. కాని, కారు దిగి లోపలికి వెళ్లేము.

ఒక మూల మెత్తటి గడ్డిలో కూర్చున్నాము. చాలమంది ఆవరణలో ఉన్నా, మొక్కల వెనకాల ఏకాంతంగానే ఉంది. సూర్యాస్తమయం కావస్తూంది.

కూర్చుని గీత ఏదో తీవ్రంగా ఆలోచిస్తూంది. "ఏమి టంత ముఖ్యమైన విషయం? బాడ్‌మింటన్ పాడైందా ఇవేళ?" అన్నాను ఏదో ఒకటి అనాలికనక.

"కాదని మీకు తెలుసును" అంది గీత రెండు గడ్డిపరకల పొడవు పరీక్షిస్తూ.

"డార్జిలింగ్ లాగలేదా ఇక్కడ?" అన్నాను.

"లేదు—" అంది గీత.

త్వరగా అక్కణ్ణించి వెళ్లాలని ఉంది నాకు. కాని, గీతని బాధించేందుకు మనస్సు ఒప్పుకోలేదు. అదికాక ఆ పరిసరాల్లో ఆమె సాన్నిహిత్యం ఏమీ బాధాకరంగా లేదనే విషయం కొంచెం ఆశ్చర్యంగా తెలిసివచ్చింది.

అప్పుడూ అప్పుడూ నాకు అనుమానం కలుగుతూ ఉండేది— నిజంగా గీతకి నేనంటే ఇష్టమేనా అని. ఏవో వింత

ఆలోచనల్లో ఈ సాయంకాలం నా దగ్గిరగా కూర్చుని ఆలో చిస్తూన్న గీత ఆ అనుమానాలన్నిటికీ బలం ఇస్తూంది. ఏ క్షణం లోనో, బలహీనతలో నేను పెళ్ళిమాట ఎత్తితే మిగిలిన విష యాలన్నీ నిమిషాలమీద నిర్ధారణకి వస్తాయని నాకు తెలుసును. ఈ క్షణంలో ఈ అమ్మాయి ఆ బలహీనతని మరీ అధికం చేస్తూంది. బహుశా వజ్రాయుధంలాగ పనిచేసే కొద్ది మాట లతో, అంతకన్నా బలవత్తరమైన కొన్ని కన్నీటి బిందువులతో గీత నా దీక్షని పటాపంచలుచేసే ఆలోచనలో ఉందనిపించింది.

రాధ హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది. రంగనాథం వివ రంగా ఎప్పుడూ చెప్పలేదు అలాటి అవకాశం నేనే ఇవ్వలేదు కాని, బహుశా ఇలాటి సాయంత్రం, ఇలాటి కళ్లు, బరువుగా ఆర్ద్రంగా అతన్ని లొంగదీసి ఉంటాయి!

"దాహంగా ఉంది. వెళ్ళి కోక్స్ తాగుదాం పద" అన్నాను లేచి నిలబడుతూ. పరాక్రమానికి పలాయనం ఉత్తమ భాగం అని కాదు. రంగనాథాన్ని వెతికి పరిస్థితులు సరిచేసేదాకా మనశ్శాంతిలేక.

గీత చెయ్యి చాపడంకాని, నేను ఆమెని లేవదియ్యడం కాని, కొంతదూరం వెళ్లేదాకా, ఆమె స్పర్శ కొత్తగా కని పించేదాకా నేను గమనించలేదు. ఆమె వేళ్లు నేను పట్టు కున్నానో, నా వేళ్లు ఆమె పట్టుకుందోనని ఆలోచించడంలో, పరిస్థితి మార్చే ప్రయత్నం చెయ్యలేదు నేను — కారులో కూర్చునేదాకా. అక్కణ్ణించిమాత్రం జాగ్రత్తపడ్డాను. షాజ హాన్ గార్డెన్స్‌దాకా వెళ్ళి బయట పార్క్‌చేసిన వాహనాల్లో

రంగనాథం స్కూటర్ లేదని నిర్ధారించుకుని క్వాలిటీ హోటల్‌కి వెళ్లేము. ఇంతసేపూ గీత ఒక్కసారికూడా మాట్లాడలేదు.

హోటల్లో చాలామంది ఉన్నా, ఒక టేబిల్ దొరికింది. కూర్చుని మెనూచూస్తూ, "ఏంకావాలి?" అన్నాను.

చిరునవ్వుతో, "ప్రస్తుతానికి — కోకాకోలా" అంది గీత.

ఇలాంటి పరిస్థితుల్లో అన్న మాటలకన్న అనని మాటలకే ప్రాముఖ్యం ఎక్కువ. నవ్వుతున్న ఆమె కళ్ళల్లోకి చూశాను. గీత తలవంచుకుంది. సున్నితంగా వస్తూన్న సంగీతం ఆ నిమిషాలకి ఎంతో చక్కటి రంగుల్ని పూసింది.

"ఐస్ క్రీమ్ తిను — ఏ ఫ్లేవర్?" అన్నాను.

"మీ ఇష్టం!"

"నీ ఇష్టం చెప్పు"

"మీ ఇష్టం"

బేరర్ కొంచెం తొందర పడుతూన్నట్లుండడాన్న ఆ ప్రశ్నోత్తరాలని ఇంకా పొడిగించకుండా స్ట్రాబెరీ క్రీమ్స్ రెండు ఆర్డరు చేసేను.

నెమ్మదిగా "ఎవరికోసం వెదుకుతున్నారు ఇవాళ?" అంది గీత. ఆలోచించకుండానే, "రంగనాథంకోసం" అన్నాను.

"అలాగే అనుకున్నాను" అంది గీత.

"ఎందుకని?"

ఏం చెప్పాలన్నట్టు కొంచెం ఆలోచించి, "సాయంత్రం ఆయన బ్రదర్ దగ్గిరికి వచ్చారు..." అంది గీత ఆగుతూ.

"వచ్చి?"

"ఏవో కుటుంబ వ్యవహారాల గురించి చెప్పేరు... నేనంతా వినలేదు కాని బ్రదర్ చెప్పేడు."

"ఏమని?"

అయిష్టంలాగ ఆగి, మళ్లీ... "వెంకటేశన్ అనే ఎవరి గురించో... అతనితో మాట్లాడమని ఇంట్లో ఏదో పోట్లాట జరిగిందట—"

"అవును — మీ బ్రదర్‌కి వెంకటేశన్ తెలుసా!"

"ఆఁ... అతను బ్రదర్‌కి సప్లయరు..."

కొంత అర్ధమైంది. రంగనాథం చాలా తెలివితేటలుగా ప్రవర్తించేడనే ఆలోచన వెనకాల అతని దౌర్బల్యం నాకు కోపం తెప్పించింది. రాధని నిలవదీసి అడక్క ఈ డొంక తిరుగుడు దారి అతనెందుకు పట్టాలి? రాధ అంటే అతని కెందుకంత భయం?

ఐస్‌క్రీమ్ వచ్చింది. తింటూ పరధ్యానంగా ఉండిపోయాను. గీత ఏదో అంది.

"ఏమిటి?" అన్నాను.

"మీ స్నేహితుడికి భార్య అంటే భయమా?" అంది గీత.

"అవును — అతను కొంచెం వీక్" అన్నాను.

స్పూన్‌తో ఐస్‌క్రీమ్ కొంచెం ఎత్తిపట్టుకుని, "అది ముఖ్యంగా ఆమె తప్పు అనుకుంటాను" అంది గీత.

"ఏం?"

"భార్య ఉత్తమురాలయితే భర్త ప్రేమించాలిగాని, భయపడడు" అంది గీత.

కళ్లుదించుకొని గీత ఐస్‌క్రీమ్ తింటూంది. ఆ ముఖంలో ప్రశాంతత, లావణ్యం ఆ మాటలకి ఏవో వాగ్దానాల రూపం ఇచ్చేయి. ఆ క్షణంలో గీతమీద నా అభిప్రాయం అంతా మారి పోయింది.

కొంచెంసేపట్లో బయటికి వచ్చాము. ఏడు దాటింది టైము. గీతని క్లబ్‌లో వదిలి వెయ్యి ఆలోచనలతో ఇంటికి వెళ్లేను. రంగనాథం గురించి ఆలోచించినప్పుడల్లా గీత జ్ఞాపకం వస్తూంది.

"సాయంత్రం మీరు వెళ్ళేక రంగనాథంగారు వచ్చారు" అన్నాడు సర్వెంటు,

"ఏం చెప్పేరు?" అన్నాను.

"ఏమీ చెప్పలేదు, రెండుమూడుసార్లు టెలిఫోన్ చేసి వెళ్లిపోయారు

భోజనం చేశాక మరీ అశాంతిగా ఉండి మళ్లీ కారు తీసుకుని రంగనాథం ఇంటికి వెళ్లేను. అతను వెళ్లగానే కని పించి, "రా...సాయంత్రం నీకోసం వచ్చేను" అన్నాడు.

"కూర్చునే టైమ్ లేదు. రాధ ఏం చేస్తూంది?" అన్నాను.

"భోజనం చేస్తూంది...సాయంత్రం కొంచెం గొడవ జరిగింది."

అంటే రాధ నా రాకమాట చెప్పలేదన్నమాట!

రంగనాథం త్వరగా చెప్పుకుపోతున్నాడు. "నిర్మల తెలుసుగా! మా ఆఫీసులో స్టెనో...ఆ అమ్మాయి నన్ను తప్పుగా అర్థం చేసుకుంది...వివరాలకేంలే-తప్పు కొంత నాదీ అనుకో..."

"ఏమిటది?"

"స్నేహంగా భుజంమీద చెయ్యివేశానులే-ఆ సంగతి వెంకటేశన్-ఆమె బ్రదర్ లేడూ...రాధకి ఫ్రెండ్-రాధతో చెప్పేడు."

"ఎప్పుడు?"

"సాయంత్రం. రాధ చాలా సెన్సిటివ్...ఆమెకి ఎలాగ తెలియజెప్పడమో తెలీక సాయంత్రంనించీ ఎంతో బాధ పడ్డాను. నీకోసం వచ్చేను."

"ఆఁ తెలిసింది...చివరికి ఏమైంది?"

"నిజం పూర్తిగా చెప్పేశాను రాధకి. ముందర చాలా కోపగించినా, చివరికి క్షమించింది. ఆమె అంత మంచిమనిషి రావ్!...రైట్! రేపు వస్తాను ఏం?"

రాధ వచ్చే సూచనలు గమనించాడనుకుని, తలలో వెర్రిగా తిరుగుతూన్న ఆలోచనలతో బయటికి దారితీశాను. రంగనాథం పరిస్థితి విషాదకరమో, హాస్యాస్పదమో నాకు తెలియదు,

ఏమీ తోచక క్లబ్ చేరుకున్నాను. ఇంకా పది గంటలు కాలేదు. హడావిడిగా ఉంది. నేను లోపలికి వెళ్లేసరికి గీత కారు పక్కన నిలబడి కనిపించింది. ఎందుకో చాలా సంతోషం కలిగింది. వెళ్లి "ఇంటికా?" అన్నాను.

సిగ్గుగా నవ్వి, "ఆఁ...కాని, స్టార్టు కావడంలేదు... ఎక్కడో వైర్ పార్టు అయిందనుకుంటూను" అంది మళ్లీ స్టార్టర్‌ని పరీక్షిస్తూ.

"కారు ఇక్కడ వదిలి...నేను దిగబెడతాను" అన్నాను.

ఆమె కారు లాక్ చేసి వచ్చి నా పక్కన కూర్చుంది. "మీకు శ్రమ ఇస్తున్నాను" అంది.

నేను జవాబివ్వకుండానే, రంగనాథం గురించిన ఆలోచనల్లో మునిగిపోయాను. పది నిమిషాల తరవాత పానగల్ పార్కు మధ్య ఒక నిర్ణయానికి వచ్చి, కారు ఆపుచేసి, "గీతా! నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతాను ఇష్టమైతే జవాబుచెప్పు" అన్నాను.

"అడగండి"

"భార్యలు భర్తలతో అబద్ధాలు చెప్పవచ్చా?"

"కూడదు?"

"భర్తలని అదుపులో పెట్టాలా?"

"కూడదు."

ఇంకేమీ అడగాలనిపించలేదు — ముఖ్యమైన చివరి ప్రశ్న తప్ప. ఆ ప్రశ్నకి జవాబుగా, "మీకు తెలుసును" అని చిరుగా నవ్వింది గీత.

ఆమెని ఇంటిదగ్గిర దిగబెట్టివచ్చి, కొన్ని ఉత్తరాలు రాశాను. ఆ తరవాత...

* * *

ఇవాళ గీత ఇంటికి రాలేదింకా... క్లబ్‌లో ఆలస్యం అయిఉంటుంది. ఆరుబయట నక్షత్రాలకింద కూర్చుంటే ఆనాటి కథ అంతా జ్ఞాపకం వచ్చింది. రంగనాథం మూర్ఖత్వంవల్ల కాకపోతే, ఈనాడు గీతకోసం తియ్యగా ఎదురుచూస్తూ కూర్చునే అదృష్టం కలగకపోను, ఈ పదహారు నెలలనుంచి గీత నా భార్యగా ఎంత ఆనందం ఇచ్చింది.

నేను మూడునెలలై క్లబ్‌కి వెళ్ళడంలేదు...ఆ రోజు కొంచెం విస్కీ తాగి క్లబ్‌లో హెలెన్ చేతులు పట్టుకున్న సంగతి నిజమే. గీత మరీ సెన్సిటివ్-కాని క్షమించింది. ఆమె చెప్పే ముందరే నేను నిర్ణయించుకున్నాను క్లబ్‌కి వెళ్ళకూడదని.

ఈమధ్య రంగనాథం మరీ కనిపించడంలేదు!...రాధ నిజంగానే అతన్ని కట్టుదిట్టం చేసేసింది! ఏమిమనిషి, అతను మాత్రం ?

గీత వేగం తిరిగివస్తే బాగుండును.

---